VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ శనివారం 05 సెప్టెంబర్ 2026వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 71
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



ఏఐకి పెరిగిన ఆదరణ




# కేబినెట్‌లోకి రాములమ్మ..!?

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో ఆమె స్థానంలో మరో మహిళా నేతను కేబినెట్‌లోకి తీసుకునే అవకాశంపై కాంగ్రెస్ హైకమాండ్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సినీ నటి విజయశాంతి పేరు తెరపైకి వచ్చింది. ఆమె మంత్రి పదవి కోసం హైకమాండ్‌తో చర్చలు జరుపుతున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంతో ప్రస్తుతం రేవంత్ రెడ్డి కేబినెట్‌లో సీతక్క ఒక్కరే మహిళా మంత్రిగా ఉన్నారు.



దీంతో సురేఖ స్థానంలో మరో మహిళా నేతకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ తరఫున పలువురు మహిళా ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ.. విజయశాంతికి అవకాశంఇవ్వాలనే ఆలోచన రాష్ట్ర నాయకత్వంలో ఉన్నట్లు తెలుస్తోంది. పాలకుర్తి ఎమ్మెల్యే మమిడాల యశస్వినీ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. తెలంగాణ రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్ నేతగా విజయశాంతి గుర్తింపు పొందారు.

# నీటిని పొదుపుగా వాడుకోండి

- జలాశయాల్లో తగినంత నీళ్లు లేవు
- విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని వాడొద్దు
- పోతిరెడ్డిపాడు నుంచి నీటి నియంత్రించాలి
- తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ సూచన
- నీటి పంపకాల్లో కుదరని ఏకాభిప్రాయం..
- వాడీవేడిగా కేఆర్ఎంబీ సమావేశం
- మరోసారి వాయిదా పడ్డ కృష్ణాబోర్డు భేటీ
- 50 శాతం తెలంగాణ వాటా అడిగాం
- తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు

కృష్ణా జలాల పంపిణీపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రెండు రాష్ట్రాలు తమ వాదనలు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సహా ఇతర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి చేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. నీటి వాటా విషయంలో ఇరు రాష్ట్రాలు తమ తమ వాదనలకే కట్టుబడటంతో ఏకాభిప్రాయం కుదరలేదు.

న్యూఢిల్లీ: తెలుగురాష్ట్రాలకు కేఆర్ఎంబీ కీలక సూచనలు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కోసమే నీటిని ప్రాజెక్టుల నుంచి దిగువకు విడుదల చేయొద్దని పేర్కొంది. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను నియంత్రించాలంది. రెండు రాష్ట్రాల(ఏపీ, తెలంగాణ) నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని, ఉమ్మడి జలాశయాల్లో నీరు తక్కువగా ఉన్నందువల్ల పొదుపుగా వాడుకోవాలని సూచన చేసింది. కష్టకాలంలో తాగునీటికే ప్రాధాన్యం ఇవ్వాలని విభజన చట్టం నిర్దేశిస్తోందని కేఆర్?ఎంబీ స్పష్టం చేసింది. కృష్ణా జలాల అంశంపై ప్రతిష్టంభన వీడలేదు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో తేల్చాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని నీటి నిల్వలపై చర్చించేందుకు హైదరాబాద్ జలసౌధలో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ కాంబోజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీ నరసింహమూర్తితో పాటు రెండు రాష్ట్రాలకు చెందిన ఇంజినీర్లు హాజరయ్యారు. ప్రస్తుత నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, శ్రీశైలం--నాగార్జునసాగర్ జలాశయాల పరిస్థితి, నీటి విడుదలపై సమావేశంలో చర్చ జరిగింది. కృష్ణా జలాల పంపిణీపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రెండు రాష్ట్రాలు తమ వాదనలు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది.



# శిరీష హత్య కేసులో నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి
- రూ.5 లక్షల ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు
- ఘటనపై సమగ్ర విచారణకు అధికారులకు ఆదేశాలు



2

# అంతరిక్షంలో మరో మైలురాయి

## ఇస్రో విజయాల వెనుక విజ్ఞాన భారతం

- EOS-05 విజయంతో మరోసారి సత్తా చాటిన ఇస్రో
- అంతరిక్ష పరిశోధనల్లో భారత సామర్థ్యానికి నిదర్శనం
- దేశ భద్రత, విపత్తు నిర్వహణకు కొత్త బలంద
- శాస్త్ర సాంకేతిక రంగంలో పెట్టుబడుల అవసరం

# కొండా సురేఖను తొలగించారు..

## పొంగులేటి సంగతి ఏమిటి?



హైదరాబాద్: తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.



# ట్రంప్ జాబితాలో మోదీకే అగ్రస్థానం

- జీ20 సదస్సులో మోదీ-ట్రంప్ భేటీపై ఆసక్తి
- త్వరలోనే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం
- 500 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యంపై దృష్టి
- క్వాడ్, రక్షణ భాగస్వామ్యానికి మరింత బలం

వాషింగ్టన్, సెప్టెంబర్ 4 :
డిసెంబర్‌లో అమెరికాలో జరగనున్న జీ20 సదస్సు నేపథ్యంలో భారత్-అమెరికా సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని అమెరికా రాయబారి సెర్గియో గోర్ వ్యాఖ్యానించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుళ దేశాల సమావేశంగా మాత్రమే కాకుండా, కీలక ద్వైపాక్షిక చర్చలకు కూడా వేదిక కానుందని పేర్కొన్నారు.



2

## గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సమస్యల

# పరిష్కారానికి చర్యలు

- యూనియన్ ప్రతినిధులతో సమావేశమైన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- యాప్ ఆధారిత రవాణా రంగ సమస్యలపై వినతి

# ఇంటర్ విద్యను రద్దు చేసే ఆలోచనను విరమించుకోవాలి

- 'సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్' సమావేశంలో ప్రభుత్వంపై విమర్శలు
- ఇంటర్ వ్యవస్థను బలోపేతం చేయాలే గానీ తొలగించొద్దని డిమాండ్
- అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలని ముఖ్యమంత్రికి కవితసూచన



2

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# ఏఐకి పెరిగిన ఆదరణ

నేటి యుగంలో ఎఐకి ఆదరణ బాగా పెరంగిందని చెప్పుకోవాలి. ప్రతీ సంస్థ దాదాపు ఎఐపై ఆధారపడటం మేడలు పెట్టాయి. ఆ దిశగా భారతదేశంలో 2024-2026 మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంబంధిత ఉద్యోగాల జీతాలు 23 శాతం పెరిగాయని, అదే సమయంలో కొన్ని సాంప్రదాయ టెక్నాలజీ ఉద్యోగాల జీతాలు తగ్గాయని, ఇది ఉద్యోగ మార్కెట్‌లో వేతన వ్యత్యాసాన్ని పెంచుతోందని తెలిపింది. జాబ్స్ ప్లాట్‌ఫామ్ ఫౌండిట్ విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, గత సంవత్సరం ఏఐ రంగం వార్షిక ప్రాతిపదికన 12 శాతం జీతాల వృద్ధిని నమోదు చేసింది. ఇది పరిశీలించిన విభాగాలలో అత్యధికం. దీని తర్వాతి స్థానాల్లో కంప్యూటర్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ- సెమీకండక్టర్స్ చెరో 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. గత రెండేళ్లుగా కంప్యూటర్ హార్డ్‌వేర్ మరియు ఇ-కామర్స్ వంటి రంగాలలో జీతాలు తగ్గుముఖం పట్టగా, ఐటీ సేవల రంగంలో జీతాలు స్తంభించిపోయాయని నివేదిక పేర్కొంది. 0-3 సంవత్సరాల అనుభవం ఉన్న ఎంట్రీ-లెవల్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 8.87-15.41 సంపాదిస్తుండగా, 15 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉన్నవారికి ఇది రూ. 70.99-89.24 లక్షల వరకు పెరుగుతుంది. ఏఐ వేతనాలు ప్రాంతాన్ని బట్టి గణనీయంగా మారుతూ ఉంటాయి. ఇది ప్రత్యేక నైపుణ్యం ఉన్న యజమానులు, పరిణతి చెందిన టెక్నాలజీ ఎకోసిస్టమ్‌లు ఎక్కడ కేంద్రీకృతమై ఉన్నాయో ప్రతిబింబిస్తుంది. ఉత్పత్తి సంస్థలు, ఏఐ-కేంద్రీకృత స్టార్టప్‌లు, ప్రపంచ సామర్థ్య కేంద్రాల సాంద్రత కారణంగా, బెంగళూరు భారతదేశంలో అత్యధిక వేతనాలు ఇచ్చే మార్కెట్‌గా కొనసాగుతోంది. బెంగళూరులో సీనియర్ ఏఐ నిపుణులు సంవత్సరానికి రూ. 61.70-91.25 లక్షలు సంపాదిస్తున్నారు. ఇది ఎన్‌సిఆర్ లేదా ముంబై కంటే సుమారు 10-15 శాతం ఎక్కువ, సీనియర్ స్థాయిలో చెన్నై కంటే 40 శాతం వరకు అధికం. విస్తరిస్తున్న జిసిసి, ఉత్పత్తి ఇంజనీరింగ్ పెట్టుబడుల మద్దతుతో హైదరాబాద్ దీనికి గట్టి పోటీదారుగా ఎదుగుతోంది. సైబర్‌సెక్యూరిటీ రంగంలో గరిష్ట వేతన పరిమితి సంవత్సరానికి రూ. 97.81 లక్షలు, ఇది పరిశీలించిన అన్ని విభాగాలలోకెల్లా అత్యధికమని నివేదిక పేర్కొంది. దీనికి విరుద్ధంగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- ఐటి సర్వీసెస్‌లో ప్రారంభ వేతనం సంవత్సరానికి రూ. 2.68-5.08 లక్షలతో మొదలై, 15 ఏళ్లకు పైబడిన వారికి సంవత్సరానికి రూ. 57.55--72.13 లక్షలకు చేరుకుంటుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ రెండు విభాగాలలోనూ వేతనాల్లో 1 శాతం తగ్గుదల నమోదైంది. కంపెనీలు దేనికి అధిక వేతనం చెల్లించాలనే విషయంలో ఎంపిక చేసుకుంటున్నాయి. కేవలం అనుభవం మాత్రమే ఇకపై అత్యధిక జీతాల పెంపును అందించడం లేదు. ఒక నైపుణ్యం వ్యాపారానికి అవసరమైన సామర్థ్య లోపాన్ని పూరిస్తుందా లేదా అన్నదే ముఖ్యం. అది ఏఐ వ్యవస్థలను నిర్మించడం, మౌలిక సదుపాయాలను భద్రపరచడం, ఫ్యాక్టరీలను ఆటోమేట్ చేయడం లేదా ప్రత్యేకమైన ఆరోగ్య సంరక్షణను అందించడం వంటివి కావచ్చునని ఫౌండిట్ సీఈఓ తరుణ్ సిన్హా అన్నారు. వ్యాపార అవసరాలు మారుతున్న కొద్దీ, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ, నవీకరించుకునే వారి జీతాలు కూడా క్రమంగా పెరుగుతాయని నిపుణులు అర్థం చేసుకోవాలని సిన్హా అన్నారు. టెక్నాలజీ రంగం వెలుపల జీతాల పెరుగుదల, కొత్త సామర్థ్యాలను పెంపొందించుకునే రంగాలలో కేంద్రీకృతమై ఉంది. గత రెండేళ్లలో, సెమీకండక్టర్ల రంగంలో 17 శాతం (మొదట 7 శాతం, ఆ తర్వాత 9 శాతం), ఇండస్ట్రియల్ ఆటోమేషన్ రంగంలో 13 శాతం (మొదట 5 శాతం, ఆ తర్వాత 8 శాతం) జీతాలు పెరిగాయి. ఈ రెండూ గత రెండేళ్లలో మరింత వేగవంతమయ్యాయి. ఇండస్ట్రియల్ ఆటోమేషన్‌లో సీనియర్ జీతాలు రూ. 58.90 లక్షల వార్షిక ప్యాకేజీకి, సెమీకండక్టర్లలో రూ. 48.49 లక్షల వార్షిక ప్యాకేజీకి చేరుకున్నాయి. గత ఏడాది ఆటోమోటివ్ రంగం 6 శాతం వృద్ధిని నమోదు చేసింది. మెడికల్ ప్రాక్టీస్ రంగంలో 8 శాతం జీతాల పెరుగుదల, సీనియర్ జీతాలు రూ. 56.70 లక్షల వార్షిక ప్యాకేజీకి చేరాయి. దీని తర్వాత మెడికల్ డివైసెస్ రంగంలో 6 శాతం, ఫార్మాస్యూటికల్స్ రంగంలో 4 శాతం వృద్ధి నమోదైంది. ఇక ఇదే కోణంలో ఎఐ కి ఆదరణ పెరిగితే ఆ రంగంలో రాణించే నిపుణులకు తిరుగుండదనేది నిపుణుల వాదన.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై నిరసనలు

హైదరాబాద్: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వెయ్యి రోజుల పాలనలో సబ్బండ వర్గాలకు కన్నీళ్లే మిగిలాయని బీఆర్ఎస్ శ్రేణులు ధ్వజమెత్తాయి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలతో రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యాలను ఎండగడుతున్నారు నేతలు. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్‌లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సికింద్రాబాద్‌లో ఎమ్మెల్యే పద్మారావు, సిరిసిల్లలో, దేవరకద్రలో గులాబీ సైన్యం ఆందోళనలు చేపట్టింది. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేటలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేటీఆర్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పరిపాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన తీరును సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ నేతలు వివరించారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో తల్లా మాధవి అనే దివ్యాంగురాలు తన గోడును వెళ్లబోసుకుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల సమస్యలు ఒక్కటి కూడా పట్టించుకోవడం లేదని ఆమె కన్నీటిపర్యంతమైంది. దివ్యాంగుల కోసం ఏం చేసిందో ఈ ప్రభుత్వం చెప్పాలని ఆమె ఎమ్మెల్యే పద్మారావు ముందు తన బాధను పంచుకుంది. స్థానిక ఎమ్మెల్యేగా మా దివ్యాంగుల సమస్యలను మీరైనా తీర్చాలని పద్మారావు గౌడ్‌ను కోరింది మాధవి. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన లోని వైఫల్యాలను ఎండగడుతూ.. సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లో మాజీ కార్పొరేటర్లు రోడ్డపైనే వంట చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఆరోపించారు. గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ మహిళలు, దివ్యాంగుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులు,వికలాంగులు, మహిళలకు రూ. 2500, కేసిఆర్ కిట్టు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ (తులం బంగారం), విద్యార్థులకు స్కూటీ హామీలు మరిచిపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతు నాయుడు వంటవార్పు నిర్వహించారు.

# విద్యా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

నారాయణపేట, సెప్టెంబర్ 4 : పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం కొనుగోలు చేసి అనంతరం ప్రభుత్వానికి అప్పగించిన భూమిలో ఈ పాఠశాల నిర్మాణం చేపట్టడం విశేషమని పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని మొత్తం సందర్శించి నిర్మాణ పనుల నాణ్యత, సదుపాయాలపై అధికారులతో చర్చించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని వసతులు కల్పించాలని సూచించారు. పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలు, విజ్ఞాపనలను స్వయంగా విని అధికారులకు తగిన సూచనలు చేశారు. గతంలో పాఠశాల నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులను ప్రత్యేకంగా గుర్తించి వారితో మాట్లాడారు. భూములు అందించిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మద్దూరులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనులను సీఎం పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కళాశాల నిర్మాణ స్థలాన్ని సందర్శించి డిజైన్లు, లేఅవుట్‌ను పరిశీలించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో విస్తరణకు అవకాశం ఉండేలా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట మార్పులు చేయాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. కళాశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, భద్రతా ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి స్థానికులను పలకరిస్తూ వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి కొనసాగుతోందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు.

# అంతరిక్షంలో మరో మైలురాయి

## ఇస్రో విజయాల వెనుక విజ్ఞాన భారతం

డెస్క్ సెప్టెంబర్ 4 :

**భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన +ుూం-ళీ17 ద్వారా జుూా-05 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావడం దేశానికి గర్వకారణం. ఇది కేవలం మరో ఉపగ్రహ ప్రయోగం మాత్రమే కాదు, భారత అంతరిక్ష సామర్థ్యాన్ని ప్రపంచానికి మరోసారి చాటిచెప్పిన ఘట్టం. భూమిని నిరంతరం పరిశీలించే సామర్థ్యంతో రూపొందించిన జుూా-05 భారతదేశపు తొలి జియోసింక్రోనస్ ఇమేజింగ్ ఉపగ్రహంగా గుర్తింపు పొందింది. ఈ విజయం ద్వారా అంతరిక్ష రంగంలో భారత్ మరింత బలపడిందనే విషయం స్పష్టమవుతోంది.**

ఇటీవలి కాలంలో కొన్ని మిషన్లలో ఎదురైన వైఫల్యాల నేపథ్యంలో ఈ ప్రయోగం ప్రాధాన్యం మరింత పెరిగింది. శాస్త్రీయ పరిశోధనల్లో విజయాలు, వైఫల్యాలు సహజమే. అయితే ప్రతి వైఫల్యాన్ని పాఠంగా మార్చుకుని మరింత సమర్థంగా ముందుకు సాగడం గొప్ప సంస్థల లక్షణం. జుూా-05 విజయం ఇస్రో శాస్త్రవేత్తల పట్టుదల, నిబద్ధత, సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనం. ఎన్నో నెలల కృషి, ప్రణాళిక, పరీక్షల ఫలితమే ఈ విజయం. జుూా-05 ప్రత్యేకత ఏమిటంటే, ఇది భూమికి దాదాపు 36 వేల కిలోమీటర్ల ఎత్తులో జియోసింక్రోనస్ కక్ష్య నుంచి భారత భూభాగాన్ని నిరంతరం పరిశీలించగలదు. సాధారణ భూ పరిశీలన ఉపగ్రహాలు ఒక ప్రాంతాన్ని నిర్దిష్ట వ్యవధిలో మాత్రమే గమనిస్తే, ఈ ఉపగ్రహం ఒకే ప్రాంతంపై నిరంతర నిఘా ఉంచే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. దీంతో వాతావరణ మార్పులు, తుఫానులు, వరదలు, అగ్నిప్రమాదాలు వంటి పరిణామాలను వేగంగా గుర్తించడం సాధ్యమవుతుంది. దేశ భద్రత పరంగా కూడా ఈ మిషన్ కీలకమైనది. సరిహద్దు ప్రాంతాల పరిశీలన, సముద్ర తీర ప్రాంతాల పర్యవేక్షణ, వ్యూహాత్మక సమాచార సేకరణలో జుూా-05 ముఖ్యపాత్ర పోషించనుంది. ఆధునిక ప్రపంచంలో సమాచారమే శక్తి. భూమిపై జరుగుతున్న మార్పులను వేగంగా గుర్తించే సామర్థ్యం ఒక దేశ భద్రతా వ్యవస్థకు ఎంతో అవసరం. ఈ కోణంలో చూస్తే జుూా-05 కేవలం శాస్త్రీయ విజయమే కాకుండా వ్యూహాత్మక ఆస్తిగా కూడా నిలుస్తుంది. వ్యవసాయ రంగానికి కూడా ఈ ఉపగ్రహం ద్వారా గణనీయమైన ప్రయోజనాలు లభించే అవకాశం ఉంది. పంటల పరిస్థితి, వర్షపాతం ప్రభావం, భూవినియోగ మార్పులు, నీటి వనరుల స్థితి వంటి అంశాలపై సమయానుకూల సమాచారం అందించవచ్చు.

# ఇంటర్ విద్యను రద్దు చేసే ఆలోచనను విరమించుకోవాలి: కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 4 : ఇంటర్ విద్యను రద్దు చేయాలనే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యా జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన "సేవ్ ఇంటర్ ఎడ్యుకేషన్ జంగ్ సైరన్" సమావేశంలో పాల్గొన్న ఆమె, ఇంటర్మీడియేట్ వ్యవస్థ రాష్ట్ర విద్యా రంగానికి బలమైన పునాదిగా నిలిచిందన్నారు. ఈ వ్యవస్థను తొలగించాలనే ప్రయత్నాలు విద్యార్థుల భవిష్యత్తుకు హానికరమని హెచ్చరించారు. ఇంటర్మీడియేట్ విద్య వల్ల తాను కూడా ఎంతో ప్రయోజనం పొందిన వ్యక్తినని కవిత పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో వచ్చిన సానుకూల మార్పుల ఫలితంగానే ఇంటర్ విద్య ఏర్పడిందని, తెలుగు రాష్ట్రాల్లో ఈ విధానం దేశంలోనే అత్యుత్తమంగా కొనసాగుతోందన్నారు. ప్రపంచ స్థాయి సంస్థల్లో పనిచేస్తున్న అనేక మంది ప్రతిభావంతులైన ఇంజనీర్లు, నిపుణులు ఈ విద్యా విధానం ద్వారా ఎదిగారని తెలిపారు. అందువల్ల ఇంటర్ విద్యను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందే తప్ప, తొలగించాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్య వంటి కీలక అంశాలపై విధాన నిర్ణయాలు తీసుకునే ముందు మేధావులు, విద్యా నిపుణులు, సంబంధిత వర్గాలతో సమగ్ర చర్చలు జరపాల్సిన అవసరం ఉందన్నారు. ఒక సమావేశంలో ఇంటర్ అడ్మిషన్లు నిలిపివేయాలని ప్రకటించడం, అనంతరం బోర్డు ప్రవేశాల ప్రకటనలు విడుదల చేయడం ప్రభుత్వంలో స్పష్టత లోపాన్ని సూచిస్తోందని విమర్శిం చారు.

# గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

## డ్రైవర్ల సంక్షేమం, ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యమన్న మంత్రి

హైదరాబాద్, సెప్టెంబర్ 4 : గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్ ఫామ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు శుక్రవారం మంత్రి క్వార్టర్స్‌లో ఆయనను కలిసి ఆటో, క్యాబ్, యాప్ ఆధారిత రవాణా రంగానికి సంబంధించిన పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను యూనియన్ ప్రతినిధులు అభినందించారు. 2012 తర్వాత ఆటో ఛార్జీల పెంపుపై ప్రభుత్వం ముందడుగు వేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పెరుగుతున్న జీవన వ్యయాలు, ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని రవాణా రంగ కార్మికులకు మరింత సహాయం అవసరమని పేర్కొన్నారు. మోటార్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలను త్వరితగతిన అమలు చేయాలని యూనియన్ ప్రతినిధులు కోరారు. యాప్ ఆధారిత రవాణా సేవల్లో పనిచేస్తున్న ఆటో, క్యాబ్, సరుకు రవాణా వాహనాల డ్రైవర్లకు న్యాయం జరిగేలా స్పష్టమైన నిబంధనలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. రంగంలో పారదర్శకత, సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఓలా, ఉబెర్, రాపిడో, పోర్టర్ వంటి యాప్ ఆధారిత రవాణా సంస్థలపై నియంత్రణకు సంబంధించి మోటార్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలు--2025ను సమర్థవంతంగా అమలు చేయాలని యూనియన్ ప్రతినిధులు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించే కనీస బేస్ ఛార్జీ, కిలోమీటర్ ఛార్జీ, నిమిషం ఛార్జీలను తప్పనిసరిగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనివల్ల డ్రైవర్ల ఆదాయం మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు. యాప్ ఆధారిత ప్రయాణీకుల, సరుకుల రవాణాకు ఉపయోగించే ప్రైవేట్ వాహనాల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కూడా యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. అవసరమైన చోట మోటార్ వెహికల్స్ చట్టం--1988 ప్రకారం వాణిజ్య రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేయాలని కోరారు. అలాగే పెరుగుతున్న ఇంధన ధరలు, వాహన నిర్వహణ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని హైర్ వెహికల్ ఛార్జీల పెంపుపై కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ ప్రతినిధులు సమర్పించిన అంశాలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆటో, క్యాబ్, గిగ్ మరియు ప్లాట్‌ఫామ్ వర్కర్ల సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకునేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# శిరీష హత్య కేసులో నిందితుడికి శిక్ష పడేలా చర్యలు

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

### రూ.5 లక్షల ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు

### ఘటనపై సమగ్ర విచారణకు అధికారులకు ఆదేశాలు

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 4 : ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన స్టాఫ్ నర్స్ ఊకే శిరీష హత్య ఘటనపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆయన, మృతురాలి తల్లి మరియు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ విషాద సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వారి కుటుంబానికి పూర్తి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ అంకిత్, స్థానిక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య తదితరుల సమక్షంలో మంత్రి బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున సహాయం అందజేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు ప్రొసీడింగ్స్‌తో పాటు రూ.5 లక్షల ఆర్థిక సాయం చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. కుటుంబానికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని తెలిపారు. శిరీష హత్యకు కారణమైన నిందితుడిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. కేసు విచారణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి హైదరాబాద్ పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఘటనాస్థల వసతి గృహాన్ని వెంటనే తనిఖీ చేయాలని సంబంధిత పోలీసు అధికారులను మంత్రి ఆదేశించారు. భద్రతా ప్రమాణాలు, నిర్వహణలో లోపాలపై పూర్తి నివేదిక సమర్పించాలని సూచించారు. అవసరమైతే వసతి గృహం, ఆసుపత్రి నిర్వహణపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఘటనలో ఏవైనా నిర్లక్ష్యాలు లేదా బాధ్యతారాహిత్యం ఉన్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రి, వసతి గృహ నిర్వహణకు బాధ్యులైన వారిపై విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకునేలా చూడాలని సూచించారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడదని స్పష్టం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. మహిళల భద్రత, రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. శిరీష హత్య కేసులో దోషులు తప్పించుకోకుండా చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

మాతా అమృతానందమయి ఆశీస్సులు పొందిన

# మంత్రి నారా లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

చెందిన ఈ ఆశ్రమంలో మాతా అమృతానందమయిని కలిసి ఆమె ఆశీస్సులు పొందారు. ఇది పూర్తిగా వ్యక్తిగత పర్యటనగా జరిగినట్లు సమాచారం. రాజకీయ, ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఆధ్యాత్మిక వాతావరణంలో కొంత సమయం గడిపినట్లు తెలిసింది. ఆశ్రమానికి చేరుకున్న లోకేశ్‌కు అక్కడి ప్రతినిధులు, నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆయన భక్తిశ్రద్ధలతో పాల్గొన్నట్లు ఆశ్రమ వర్గాలు వెల్లడించాయి. అనంతరం ఆశ్రమంలోని వివిధ ప్రాంతాలను సందర్శిస్తూ అక్కడి ఆధ్యాత్మిక కార్యకలాపాల గురించి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా మాతా అమృతానందమ-యితో జరిగిన భేటీ నిలిచింది. అమ్మను దర్శించుకున్న లోకేశ్ ఆమె ఆశీస్సులు పొందారు. సమాజ సేవ, విద్య, వైద్య రంగాల్లో ఆశ్రమం నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి కూడా చర్చించినట్లు తెలిసింది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకురాలిగా పేరొందిన మాతా అమృతానందమయిని కలవడం తనకు ప్రత్యేక అనుభూతిని కలిగించిందని లోకేశ్ పేర్కొన్నారు. ఆశ్రమంలో దాదాపు మూడు గంటల పాటు గడిపిన లోకేశ్ అక్కడి సంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆశ్రమంలోని గజరాజులకు స్వయంగా

# పవన్ కళ్యాణ్ శ్రావణ మాస కానుక

పిఠాపురం, సెప్టెంబర్ 4 : వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ వరలక్ష్మీ దేవిని ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. గణపతి పూజ, కలశ పూజ, అష్టోత్తర శతనామావళి, వరలక్ష్మీ స్తోత్రాలు, షోడశోపచార పూజలను సంప్రదా యబద్ధంగా నిర్వహించి భక్తులకు వ్రత మహిమను వివరించారు. వ్రత కార్యక్రమాలకు ముందు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజా కార్యక్రమాలను ప్రారంభిం చారు. వేలాది మంది మహిళలు కుటుంబ సంక్షేమం, ఐశ్వర్యం, ఆరోగ్యం కోసం అమ్మవారిని ప్రార్థిస్తూ భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలా డింది. భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని వేద పండితులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళల సౌకర్యా ర్థం వరలక్ష్మీ వ్రతాన్ని ఐదు విడతలుగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు విడతల వారీగా పూజా కార్యక్రమాలు నిర్వహించి వేలాది మంది మహిళలు పాల్గొనేలా చర్యలు చేపట్టారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా వ్రతాన్ని ఆచరించే అవకాశం లభించింది. భక్తుల భద్రత, సౌకర్యాల కోసం పోలీసులు, ఆలయ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, జనసేన పార్టీ వాలంటీర్ల సమన్వయంతో పనిచేశారు.

వేగుచుక్క

# గోపికలై మురిపించిన చిన్నారులు .





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:** శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శుక్రవారం నిజామాబాద్ లోచిన్నారి విద్యార్థినులు రంగురంగుల పట్టు పరికిణీలు, మెరిసే ఆభరణాలు, నుదుట తిలకంతో బాల గోపికల అవతారమెత్తారు.

# నలంద హైస్కూల్‌లో ఘనంగా “కృష్ణాష్టమి వేడుకలు”.

**- సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు.**

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్:**

పట్టణంలోని మామిడిపల్లిలో గల నలంద హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుని మరియు గోపికల వేషధారణలో కృష్ణుని గీతాలకు నృత్యాలు, పాటలు ప్రదర్శిస్తూ, ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీకృష్ణుని విశిష్టత, కృష్ణాష్టమి పండుగ ప్రాముఖ్యత మరియు శ్రీకృష్ణుని బోధనలు గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాల యాజమాన్యం ప్రసాద్ , సాగర్ లు విద్యార్థులందరికీ శ్రీకృష్ణుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, వారు విద్యలో మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

















# తాడ్వాయి ప్రిన్సిపాల్ కు “బెస్ట్ ప్రిన్సిపాల్” అవార్డు.

**వేగుచుక్క న్యూస్: కామారెడ్డి**



జిల్లాలోని తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో జరగనున్న వేడుకలలో రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు అవార్డుని ప్రధానం చేయనున్నది. ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో చక్కని విధులు నిర్వహిస్తూ సబ్జెక్టు పరంగా అనేక అంశాలలో సదరు ప్రిన్సిపాల్ ప్రధాన పాత్ర పోషిస్తూ ప్రత్యేకతను చాటుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ఉత్తమ ప్రిన్సిపాల్ గా ఎంపిక చేసింది. ప్రధానంగా ఇటీవల నూతనంగా ముద్రించిన ఇంటర్మీడియట్ వృక్షశాస్త్రం పాఠ్యపుస్తకాల రచన మరియు ల్యాబ్ మాన్యువల్స్ తయారీలో ప్రధాన పాత్ర పోషించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన అధ్యాపకుల శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ గా వ్యవహరించి అధ్యాపకుల వృత్తిపరమైన నైపుణ్యాలు పెంచడంలో ఆయన విశేష కృషి చేశారు. కోవిడ్ సమయంలో విద్యార్థుల ఆన్లైన్ తరగతులకు సంబంధించి సులభంగా బోధన జరిగే విధంగా ఆయన ప్రణాళికను రూపొందించి తన ప్రత్యేకతను చాటారు. దీనితోపాటు అదే సమయంలో డిడి యాదగిరి ఛానల్ ద్వారా సైన్స్ విద్యార్థులకు విద్యాబోధన చేసి విద్యార్థుల చదువు ముందుకు సాగే విధంగా కృషి చేశారు. నీట్, ఎప్సెట్, కానిస్టేబుల్, వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి అనేక మంది విద్యార్థులకు శిక్షణనిస్తున్నారు.

గత కొన్ని నెలల క్రితం కామారెడ్డి జిల్లాలోని తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్ గా పదోన్నతి పై వచ్చిన ఆయన విధి నిర్వహణలో రాజీకి తావు లేకుండా వ్యవహరిస్తూ కళాశాలను పూర్తిగా చక్క దిద్దారు. ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లడం వలన అధ్యాపకుల సమిష్టి కృషి తో ఈ కళాశాలలో ఈ సంవత్సరం అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఎంతో నమ్మకంతో ఇక్కడికి వచ్చిన విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన జరిగే విధంగా ఆయన ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రిన్సిపాల్ తీసుకుంటున్న చర్యలు, వార్షిక ప్రణాళికలు, పరీక్షల నిర్వహణ, క్రీడల నిర్వహణ వంటి విషయాలలో అధ్యాపకులు కూడా చిత్తశుద్ధిగా వ్యవహా రిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైన ప్రిన్సిపల్ శ్రీనివాస్ రావ్ ను కళాశాల అధ్యాపకులు విద్యార్థులు శ్రేయోభిలాషులు అభినందించారు.

# పలు అభివృద్ధి పనులు పరిశీలించిన సీఎం రేవంత్

**కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన**

**హాకీంపేట్ ఎడ్యుకేషన్ పనులపై ముఖ్యమంత్రి ఆరా**

హైదరాబాద్: కొడంగల్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకెళ్తున్నారు. అధికారులతో నిరంతర పర్యవేక్షణతోపాటు సీఎం సైతం వరుస పర్యటనలతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొదట నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి సాం?ఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మద్దూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం కొనుగోలు చేశారు. అదే స్థలంలో ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందుకొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. దౌలతాబాద్ మండలం గోకఫసల్వాడ్ చేరుకున్న సీఎం నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులపై అధికారులను ఆరా తీశారు.

# నిమ్స్‌లో వైద్య చికిత్సకు.. అర్బన్ ఎమ్మెల్యే ఎల్వోసీ అందజేత.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

నియోజకవర్గంలో పేదవారికి నిమ్స్ లో చికిత్స పొందేందుకు అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ ఎల్వోసీ అందించారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎల్వోసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన వారికి ఎల్ఓసి ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. నగరంలోని వర్ని రోడ్ కు చెందిన సుధీర్ సంబంధిత వ్యాధితో బాదపడుతున్నారన్నారు. దీంతో నిమ్స్ లో చికిత్స కోసం రూ.5 లక్షల ఎల్వోసీ వారి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. పార్టీలకతీతంగా పేదల ప్రాణాలను కాపాడటమే తన లక్ష్యమన్నారు. అలాగే హైదరాబాదులోని బీ బీ నగర్ ఎయిమ్స్ లో అత్యాధునిక సేవలు అందుబాటు వచ్చాయన్నారు. పేదలు దీర్ఘకాలిక వైద్య సమస్యలు ఉన్నవారు, అత్యవసర శస్త్రసికిత్సలు అవసరమైన వారు ఎయిమ్స్ కి వెళ్లాలని సూచించారు.

# కొండా సురేఖ కీలక నిర్ణయంపై ఉత్కంఠ

**“నిరీక్షణ ముగిసింది” అంటూ సోషల్ మీడియాలో సంకేతం**

**రేవంత్ రెడ్డికి సవాల్ విసిరిన సుస్మిత**

**కొండా కుటుంబం తదుపరి అడుగుపై రాజకీయ వర్గాల్లో చర్చ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**

మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ అయిన తర్వాత మాజీ మంత్రి కొండా సురేఖ ఎట్టకేలకు తన మౌనాన్ని వీడారు. త్వరలోనే ఓ కీలక నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. “నిరీక్షణ ముగిసింది.. త్వరలో కీలక నిర్ణయాన్ని ప్రకటిస్తా” అంటూ ఆమె చేసిన పోస్ట్ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఆమె తీసుకోబోయే నిర్ణయం ఏమిటన్న దానిపై కాంగ్రెస్ శ్రేణులతో పాటు రాజకీయ వర్గాల్లోనూ ఉత్కంఠ నెలకొంది. కొండా సురేఖ పోస్ట్ వెలువడిన వెంటనే రాజకీయ విశ్లేషణలు మొదలయ్యాయి. ఆమె భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై వివిధ రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మంత్రి పదవి నుంచి తొలగింపునకు గురైన తర్వాత కొంతకాలంగా మౌనం పాటించిన సురేఖ ఇప్పుడు కీలక ప్రకటనకు సిద్ధమవుతున్నట్లు సంకేతాలు ఇవ్వడంతో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశాలపై చర్చ జరుగుతోంది. ఆమె నిర్ణయం కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి ప్రభావం చూపుతుందోనన్న ఆసక్తి కూడా వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా, తన తల్లిని మంత్రి పదవి నుంచి తొలగించడంపై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన తల్లిపై ప్రత్యక్షంగా పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. తాను రేవంత్ రెడ్డి కుటుంబానికి సంబంధించిన అవినీతి అంశాలపై వ్యక్తిగతంగా మాట్లాడానని, అయితే తన వ్యాఖ్యల కారణంగా తన తల్లిపై చర్యలు తీసుకోవడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. తన అభిప్రాయాలకు పార్టీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తన తల్లి ఎదుర్కొంటున్న పరిస్థితిని చూసి తీవ్ర మనోవేదనకు గురవుతున్నానని సుస్మిత తెలిపారు. “నా తల్లిని ఇలా చూడటం బాధగా ఉంది. ఈ విషయంలో నేను రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను” అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సుస్మిత స్పందనతో కొండా కుటుంబం అసంతృప్తి బహిర్గతమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకత్వం ఎలా స్పందిస్తుందన్న దానిపైనా దృష్టి నెలకొంది. మరో వైపు, కొండా సురేఖ భర్త కొండా మురళి ఇటీవల ప్రదర్శించిన వైఖరి కూడా రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారింది.

మీసాలు మెలివేస్తూ కనిపించిన ఆయన హావభావాలు రాజకీయ సంకేతాలుగా మారాయని కొందరు విశ్లేషిస్తున్నారు. కొండా కుటుంబం తదుపరి కార్యాచరణపై ఉద్దేశ పూర్వకంగా సంకేతాలు ఇస్తోందా అనే చర్చ రాజకీ య వర్గాల్లో కొనసాగుతోంది. ఈ పరిణామాలు భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై కొత్త ఊహాగానాలకు కారణమవుతున్నాయి.

వేగుచుక్క



# ఎయిర్ పోర్టును ముంచెత్తిన వరద

- దిలీకి రెడ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండీ

**దిల్లీ, సెప్టెంబర్ 4 :**

దేశ రాజధాని ఢిల్లీకి రెడ్ అలర్ట్ జారీ చేసింది ఐఎండీ. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి అక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో నీరు సగటున చేరింది. మోకాలి లోతులో వరద నీరు నిలిచి పోయింది. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్టును కూడా వరద నీరు ముంచెత్తింది. దీంతో విమానాల రాకపోలకు ఇబ్బంది ఎదురవుతోంది. విమానాలు 17 నిమిషాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. సాయంత్రం రావాల్సిన పలు విమానాలను అధికారులు దారి మళ్లించారు. ఎయిర్పోర్టులో నీరు చేరిన దృశ్యాలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఢిల్లీతో పాటు హరియాణా, చండీగఢ్ ప్రాంతాల్లో, యూపీలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు ఐఎండీ పేర్కొంది. ఈశాన్య మధ్యప్రదేశ్లో అల్పపీడన ద్రోణి కారణంగా సెంట్రల్ ఇండియాలో వర్షాలు కురుస్తున్నాయి.

# నేపాల్ బాధితులకు అండగా నిలిచిన సోనూసూద్

**న్యూదిల్లీ, సెప్టెంబర్ 4 :**



తీవ్ర వరదలతో అల్లాడుతున్న నేపాల్ ప్రజలను ఆదుకునేందుకు ప్రముఖ నటుడు, రియల్ హీరో సోనూసూద్ రంగంలోకి దిగారు. బాధితులకు అవసరమైన దుప్పట్లు, ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసర సరుకులను భారత్ నుంచి తరలించి క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అయితే, సోనూసూద్ నేపాల్ పర్యటనపై ప్రముఖ జర్నలిస్ట్ అజిత్ అంజుమ్ సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. పనులు ఇంకా ప్రారంభం కాకముందే ఆయనను దేవుడిగా చిత్రీకరిస్తూ ప్రచారం చేసుకోవడం కేవలం సెల్ఫ్ మార్కెటింగ్ అని ఎక్స్‌లో పోస్ట్ పెట్టడం కలకలం రేపింది. అయితే ఈ ప్రతికూల విమర్శలపై సోనూసూద్ ఎంతో హుందాగా, సానుకూలంగా స్పందించారు. 'సోదరా.. మీ మనసు చాలా మంచిది. మీరు నేపాల్‌కు రండి, మన మిద్దరం కలిసి ప్రజలకు అండగా నిలబడి సాయం చేద్దాం' అంటూ రీట్వీట్ చేశారు. సోనూసూద్ చూపించిన ఈ సంస్కారం, పరిణతిపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. కాగా, త్రిశూలి నది పరివాహక ప్రాంతాల్లో వరద విధ్వంసం తీవ్రంగా ఉందని, బాధితుల ఇళ్లను పునర్నిర్మించి వారు సాధారణ జీవితం గడిపే వరకు కొన్ని నెలలపాటు తమ సూద్ ఫౌండేషన్ తరపున సహాయక చర్యలు కొనసాగుతాయని సోనూసూద్ స్పష్టం చేశారు. పరాయి దేశంలోనూ మానవత్వాన్ని చాటుకుంటూ ఆయన అందిస్తున్న సేవలకు అంతటా అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

# డిజిటల్ అరెస్ట్ ముఠాపై సీబీఐ ఉక్కుపాదం

- 20 రాష్ట్రాల్లో 89 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- మూడు కేసుల్లో రూ.42.36 కోట్ల దోపిడీ
- ముగ్గురు కీలక నిందితుల అరెస్ట్
- భారీగా బ్యాంకింగ్, డిజిటల్ ఆధారాలు స్వాధీనం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:**

దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న డిజిటల్ అరెస్ట్ సైబర్ నేరాలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) భారీ ఆపరేషన్ చేపట్టింది. 'ఆపరేషన్ చక్రVI'లో భాగంగా 20 రాష్ట్రాల్లోని 89 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ సందర్భంగా ముగ్గురు కీలక నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు భారీగా డిజిటల్ పరికరాలు, బ్యాంకింగ్ పత్రాలు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సైబర్ నేరగాళ్లు, వారి నెట్‌వర్క్‌పై దర్యాప్తును సీబీఐ ముమ్మరం చేసింది.

**మూడు కేసుల్లో రూ.42.36 కోట్ల దోపిడీ**

పోలీసులు, ప్రభుత్వ అధికారులుగా పరిచయం చేసుకుని బాధితులను నెలల తరబడి ఆన్‌లైన్‌లో బెదిరించి డిజిటల్ అరెస్ట్ చేసిన మూడు కేసులను సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఈ మూడు ఘటనల్లో బాధితులను ఒకటి నుంచి మూడు నెలల వరకు భయభ్రాంతులకు గురిచేసి మొత్తం రూ.42.36 కోట్లు కాజేసినట్లు గుర్తించింది. బిట్స్ పిలానీకి చెందిన ఓ బాధితుడి నుంచి మూడు నెలల్లో రూ.7.67 కోట్లు, గుజరాత్‌కు చెందిన వ్యక్తి నుంచి మూడు నెలల్లో రూ.19.24 కోట్లు, కర్ణాటకకు చెందిన మరో బాధితుడి నుంచి నెల రోజుల్లో రూ.15.45 కోట్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది.

**89 ప్రాంతాల్లో సోదాలు**

బాధితుల నుంచి దోచుకున్న నగదు ఎక్కడికి మళ్లించారు? నేరాల వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు? అనే అంశాలపై సీబీఐ దృష్టి సారించింది. బ్యాంకు ఖాతాలు, ఆన్‌లైన్ లావాదేవీలు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన అధికారులు 20 రాష్ట్రాల్లోని 89 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక బ్యాంకింగ్ పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు.

**ముగ్గురు కీలక నిందితుల అరెస్ట్**

మనీ లాండరింగ్, నగదు మళ్లింపు వ్యవహారాల్లో పాత్ర ఉన్న ముగ్గురిని సీబీఐ అరెస్ట్ చేసింది. హర్యానాకు చెందిన ఆకాష్ తన బ్యాంకు ఖాతాలోకి రూ.1.95 కోట్లు జమ చేయించుకుని అదే రోజు ఇతర ఖాతాలకు బదిలీ చేసినట్లు గుర్తించారు. కోల్‌కతాకు చెందిన రాజా కర్మాకర్ సంస్థ ఖాతాలోకి రూ.1.5 కోట్లు వచ్చినట్లు దర్యాప్తులో తేలింది. జ్యోతి రాణి తన ఖాతాలోకి వచ్చిన నగదులో కొంత మొత్తాన్ని విత్‌డ్రా చేసి, మిగతా మొత్తాన్ని ఇతర ఖాతాలకు బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న మరిన్ని నిందితులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు సీబీఐ దర్యాప్తును వేగవంతం చేసింది.




# నేపాల్‌టిబెట్ వరదల్లో 275 మంది భారతీయులు గల్లంతు

- 166 మందిని సురక్షితంగా రక్షించిన భారత్
- విపత్తులో 1,308 మంది మృతి.. 5,624 మంది గల్లంతు
- టిబెట్ నుంచి నేపాల్‌లోకి 1,907 మంది భారతీయులు
- 9 రోజుల తర్వాత ఇద్దరు కార్మికులు సజీవంగా



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:**

నేపాల్‌టిబెట్ సరిహద్దులో భారీ వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో 275 మంది భారతీయులు గల్లంతైనట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. ఇప్పటివరకు నేపాల్‌లో 166 మంది భారతీయులను సురక్షితంగా రక్షించినట్లు తెలిపింది. గల్లంతైన వారి ఆచూకీ కోసం నేపాల్ ప్రభుత్వం, ఆ దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు భారత్‌లోని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

**రక్షణ చర్యలు ముమ్మరం**

రక్షించిన 166 మంది భారతీయుల పేర్లను విదేశాంగ శాఖ ఎప్పటికప్పుడు వెల్లడిస్తోందని జైస్వాల్ తెలిపారు. సహాయక చర్యల్లో నేపాల్ అధికారులు చేస్తున్న కృషిని భారత్ అభినందిస్తోందన్నారు. చైనా నుంచి 1,907 మంది భారతీయులు సురక్షితంగా నేపాల్‌లోకి చేరుకున్నట్లు తెలిపారు. టిబెట్ అటానమస్ రీజియన్‌లో భారతీయ ప్రయాణికులు ఎవరూ చిక్కుకుపోలేదని చైనా అధికారిక వర్గాలు ధ్రువీకరించినట్లు పేర్కొన్నారు.

**భారీగా ప్రాణ నష్టం**

నేపాల్, టిబెట్‌లో సంభవించిన ప్రకృతి విపత్తులో ఇప్పటివరకు 1,308 మంది మరణించగా.. మరో 5,624 మంది గల్లంతైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నేపాల్‌లో 1,287 మంది మృతి చెందగా, 5,083 మంది ఆచూకీ తెలియడం లేదు. టిబెట్‌లో 21 మంది మరణించగా, 541 మంది గల్లంతైనట్లు చైనా అధికారిక మీడియా వెల్లడించింది. హిమాలయ ప్రాంతాల్లో ట్రెక్కింగ్, యాత్రలకు వెళ్లినవారితో పాటు 800 మందికి పైగా విదేశీయులు గల్లంతైనట్లు సమాచారం.

**9 రోజుల తర్వాత సజీవంగా**

వరదలు, కొండచరియలు, మట్టి, రాళ్లతో దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నేపాల్‌లోని త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్రాజెక్టు సమీపంలోని ఓ సొరంగంలో తొమ్మిది రోజులుగా చిక్కుకుపోయిన ఇద్దరు కార్మికులను సజీవంగా గుర్తించారు. సంజయ్ షా, కబీర్ మహర్జన్‌లను సొరంగం నుంచి బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. సొరంగ మార్గాల్లో భారీగా మట్టి, రాళ్లు పేరుకుపోవడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయని నేపాల్ ఆర్మీ కల్నల్ ఝుబీంద్ర రేష్మి తెలిపారు. నీటిని బయటకు పంపడంతో పాటు శిథిలాలను తొలగిస్తూ మరెవరైనా సజీవంగా ఉన్నారా అనే కోణంలో గాలింపు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

**ఆగస్టు 26న విపత్తు**

నేపాల్‌టిబెట్ సరిహద్దు సమీపంలో ఆగస్టు 26న మంచు పొరలు లేదా హిమనదీ ప్రాంతం కూలిపోవడంతో భారీగా నీరు, మంచు, రాళ్లు, మట్టి నదీ వ్యవస్థలోకి ప్రవహించినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రవాహం లోయల గుండా నేపాల్, టిబెట్ ప్రాంతాలకు చేరుకుని భారీ విధ్వంసం సృష్టించింది. ఇళ్లు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా త్రిశూలి నది లోయ తీవ్రంగా ప్రభావితమైంది.

**భారత్ భారీగా సహాయం**

నేపాల్‌లో సహాయక చర్యలకు భారత్ మద్దతు కొనసాగిస్తోంది. భారత్ పంపిన ఐదో సహాయక విమానం 11 మంది సభ్యులతో కూడిన రెస్క్యూ బృందం, ప్రత్యేక పరికరాలు, 5.5 టన్నుల వైద్య సామగ్రిని నేపాల్‌కు తీసుకెళ్లింది. భారత రెస్క్యూ బృందాలు నేపాల్ అధికారులతో కలిసి సహాయక, పునరావాస చర్యల్లో పాల్గొంటున్నాయి. ప్రాణాలతో ఉన్నవారి కోసం గాలింపు, మృతదేహాల వెలికితీతలోనూ సహకరిస్తున్నాయి.

# పసిడి ధరలకు మళ్లీ రెక్కలు

- హైదరాబాద్‌లో ఒక్కరోజే రూ.1,310 పెరుగుదల
- 10 గ్రాముల 24 క్యారెట్ల ధర రూ.1,56,660
- 22 క్యారెట్ల ధర రూ.1,43,600కు చేరిక
- రెండు రోజుల్లో రూ.4,640 వరకు పెరిగిన ధర



**హైదరాబాద్, సెప్టెంబర్ 4:**

పసిడి ధరలు మళ్లీ భారీగా పెరుగుతున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో వరుసగా ధరలు ఎగబాకుతుండటంతో కొనుగోలుదారుల్లో ఆందోళన నెలకొంది. తాజాగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,310 పెరిగి రూ.1,56,660కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,210 మేర పెరిగి రూ.1,43,610 వద్ద నమోదైంది.

**రెండు రోజుల్లో భారీ పెరుగుదల**

కేవలం రెండు రోజుల వ్యవధిలోనే 10 గ్రాముల పసిడి ధర రూ.4,640 వరకు పెరగడం గమనార్హం. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకుంటున్న వినియోగదారులు ధరల పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు.

**అంతర్జాతీయ ప్రభావం**

అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధరల పెరుగుదల దేశీయ మార్కెట్‌పైనా ప్రభావం చూపుతోంది. అమెరికా ద్రవ్య విధానం, డాలర్ విలువ, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి అంశాలు పసిడి ధరల కదలికలను ప్రభావితం చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో ప్రపంచ మార్కెట్‌లో బంగారానికి డిమాండ్ పెరగడం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోంది.

**పండగలు, పెళ్లిళ్ల వేళ భారం**

పండగలు, పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న సమయంలో పసిడి ధరలు ఈ స్థాయిలో పెరగడం సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపనుంది. రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు, డాలర్ విలువ, అమెరికా వడ్డీ రేట్లపై అంచనాలు బంగారం ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# క్రీడాకారిణిపై ఏఐ వేధింపులు

- వేలాది అసభ్యకర చిత్రాలతో కేయా కునాల్ బెనర్జీకి వేధింపులు
- డిజిటల్ వేధింపులపై కఠిన చర్యలకు డిమాండ్
- మహిళా క్రీడాకారిణుల భద్రతపై ఆందోళన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్4 :**

ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ మహిళా క్రీడాకారిణులను ఆన్‌లైన్‌లో వేధిస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా 140 కిలోల డెడ్‌లిఫ్ట్‌తో క్రీడావర్గాల్లో గుర్తింపు పొందిన 21 ఏళ్ల భారత పవర్‌లిఫ్టర్ కేయా కునాల్ బెనర్జీ ఆన్‌లైన్ లైంగిక వేధింపులకు గురయ్యారు. తన ముఖం, శరీరాన్ని ఉపయోగించి ఏఐ ద్వారా రూపొందించిన వేలాది అసభ్యకర, అభ్యంతరకర చిత్రాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రతిభను పక్కనపెట్టి వేధింపులు**

క్రీడారంగంలో ప్రతిభను చాటుకుని దేశానికి పేరు తీసుకురావాలనే లక్ష్యంతో కష్టపడుతున్న సమయంలో ఇలాంటి డిజిటల్ వేధింపులు తనను తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తున్నాయని కేయా పేర్కొన్నారు. తన విజయాలను గుర్తించి ప్రోత్సహించాల్సిన సమయంలో కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో అసభ్యకర కంటెంట్‌ను ప్రచారం చేయడంతో పాటు వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.

**ఏఐ దుర్వినియోగంపై ఆందోళన**

తనపై జరుగుతున్న ఆన్‌లైన్ వేధింపులు నిరంతరం కొనసాగుతున్నాయని, దీంతో తీవ్ర అసౌకర్యం, ఇబ్బందిని ఎదుర్కొంటున్నానని కేయా వెల్లడించారు. ఏఐ సాంకేతికతను తప్పుడు మార్గాల్లో ఉపయోగించి మహిళా క్రీడాకారిణుల గౌరవానికి భంగం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**కఠిన చర్యలకు డిమాండ్**

మహిళల ముఖాలు, శరీరాలను ఉపయోగించి నకిలీ అసభ్యకర చిత్రాలను రూపొందించి ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని క్రీడాభిమానులు, నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఏఐ ఆధారిత దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు మహిళా క్రీడాకారిణులకు ఆన్‌లైన్‌లో భద్రత కల్పించేందుకు కఠిన చర్యలు అవసరమని కోరుతున్నారు.

## వీధికుక్కే రక్షణగా నిలిచింది

**కోయంబత్తూరు, సెప్టెంబర్ 4:**

తమిళనాడులోని కోయంబత్తూరులో ఓ వీధికుక్క చూపిన చొరవ చర్చనీయాంశంగా మారింది. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళపై లైంగిక దాడికి యత్నించిన 17 ఏళ్ల బాలుడిని ఆ శునకం అడ్డుకుని ఆమెను కాపాడింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాలో నమోదయ్యాయి. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో శునకంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

**అర్ధరాత్రి ఘటన**

కోయంబత్తూరు సమీపంలోని తుడియలూరు రైల్వే ఓవర్‌బ్రిడ్జి సర్వీస్ రోడ్డులో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఓ మహిళ వీధికుక్క సమీపంలో కూర్చుని ఉండగా, మద్యం మత్తులో ఉన్న 17 ఏళ్ల బాలుడు అక్కడికి వచ్చాడు. తొలుత శునకాన్ని అక్కడి నుంచి తరిమేందుకు ప్రయత్నించిన అతడు.. అనంతరం మహిళపై లైంగిక దాడికి యత్నించాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో శునకం అప్రమత్తమైంది.

**బాలుడిని తరిమిన శునకం**

మహిళ అరుపులు విన్న వెంటనే శునకం బాలుడిపై దాడి చేసింది. అతడి కాళ్లను కరవడంతో భయపడిన బాలుడు అక్కడి నుంచి పరుగులు తీశాడు. శునకం కొంత దూరం వరకు అతడిని వెంటాడి తరిమికొట్టింది. ఈ మొత్తం ఘటన సమీపంలోని సీసీటీవీ కెమెరాలో నమోదైంది.

**నిందితుడు అరెస్ట్**

సీసీటీవీ దృశ్యాల ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించి అదే రోజు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరు పరచగా.. న్యాయస్థానం అతడిని అబ్జర్వేషన్ హోంకు తరలించింది. ఘటనపై పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**నెటిజన్ల ప్రశంసలు**

ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. నిస్సహాయురాలైన మహిళను కాపాడేందుకు శునకం స్పందించిన తీరును ప్రశంసిస్తున్నారు.

# మెలోనికి మోదీ శుభాకాంక్షలు

- భారత్-ఇటలీ బంధం మరింత బలోపేతం
- చారిత్రక ఘనత సాధించిన ఇటలీ ప్రధాని
- మెలోని నాయకత్వంపై ప్రజల విశ్వాసానికి నిదర్శనం
- మోదీకి కృతజ్ఞతలు తెలిపిన మెలోని

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:**

ఇటలీ యుద్ధానంతర చరిత్రలో అత్యంత సుదీర్ఘ కాలం వరుసగా ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నేతగా జార్జియా మెలోని రికార్డు సృష్టించారు. ఈ చారిత్రక ఘనతపై ప్రధాని నరేంద్ర మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. దీనిపై స్పందించిన మెలోని.. భారత్‌ఇటలీ సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత బలంగా ఉన్నాయని పేర్కొన్నారు.

**మోదీకి మెలోని ధన్యవాదాలు**

తనకు శుభాకాంక్షలు తెలిపిన మోదీకి మెలోని ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. మోదీతో ఉన్న స్నేహాన్ని ప్రస్తావిస్తూ.. భారత్, ఇటలీ మధ్య సంబంధాలు ప్రస్తుతం అత్యంత బలమైన స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల ప్రారంభించిన ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం రెండు దేశాల మధ్య సంబంధాలకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు.

**కొత్త అవకాశాలకు భాగస్వామ్యం**

భారత్, ఇటలీకి చెందిన నైపుణ్యాలను పరస్పరం అనుసంధానించడం ద్వారా కొత్త అవకాశాలను సృష్టించేందుకు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం దోహదపడుతుందని మెలోని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య సహకారం మరింత విస్తరించేందుకు ఈ భాగస్వామ్యం కీలకంగా మారుతుందని తెలిపారు.

**మెలోనికి మోదీ అభినందనలు**

మెలోని సాధించిన చారిత్రక ఘనత ఇటలీ ప్రజలు ఆమె నాయకత్వంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని మోదీ పేర్కొన్నారు. భారత్‌ఇటలీ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో మెలోని స్నేహం కీలకంగా ఉందన్నారు. రెండు దేశాల ప్రజల కోసం సంపన్నమైన భవిష్యత్తును నిర్మించేందుకు ఆమెతో కలిసి సన్నిహితంగా పనిచేయాలని ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. మెలోని భవిష్యత్తు విజయాలకు మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

